సాక్షి సూర్యాపేట
సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



పిల్లలమర్రి ఆలయాల సందర్శన
పిల్లలమర్రిలోని ఆలయాలను ఆదివారం రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకుడు అర్జునరావు సందర్శించారు. - 8లో



భక్తుల రద్దీ సాధారణం
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగానే కనిపించింది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	585.80 అడుగులు
ఇన్‌ఫ్లో	:	5,88,743 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	5,88,743 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,130 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

• సద్దుల బతుకమ్మకు సిద్ధం




జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ చౌరస్తాలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పూలు



సూర్యాపేట మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం, బారికేడ్లు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సూర్యాపేట

లక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

• 60 తులాల బంగారం, రూ.36.80 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరణ



చిలుకూరులో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 60 తులాల బంగారు ఆభరణాలు, రూ.36.80 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

న్యూస్‌రీల్

పేట మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

భానుపురి (సూర్యాపేట) : సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈనెల 29 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఫసీయుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన సద్దుల బతుకమ్మ పండుగ ఉండడంతో వ్యాపారులు, కార్మికుల కోరిక మేరకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. అలాగే దుర్గాష్టమి, దసరా పండుగల నేపథ్యంలో వచ్చేనెల 3వ తేదీ వరకు మార్కెట్ యార్డు, కార్యాలయానికి సెలవులు ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు సెలువు దినాల్లో యార్డుకు ధాన్యం, ఇతర ఉత్పత్తులను తీసుకురావొద్దని కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహుని నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవి రాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవంతోపాటు నిత్యకల్యాణం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత మహానివేదన నగావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి క్షేత్రంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలు అర్పించి సహస్రనామార్చనతో కొలిచారు. ఆ తరువాత ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. రాత్రి స్వామి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పత్తిచేలు.. ఎర్రబారె



ఎర్రబారిన ఈ పత్తిచేను నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో ఈరేటి అంజయ్య సాగు చేసింది. ఈయన సీజన్ ప్రారంభంలో తనకున్న ఐదెకరాల్లో పత్తిపంట సాగుచేయగా చేను ఏపుగా పెరిగి పూత, పిందె దశకు చేరింది. ఆగస్టులో వరుసగా కురిసిన అధిక వర్షాల కారణంగా భూమిలో తేమ శాతం అధికమై ప్రస్తుతం పత్తి పెగులుతున్న సమయంలో చేనంతా ఎదుగుదల లోపించి ఎర్రబారింది. దిగుబడిపై ప్రభావం చూపనుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధిక వర్షాల కారణంగా జిల్లాలో చాలాచోట్ల పత్తిచేలు ఇలాగే ఎర్రబారి ఉన్నాయి.

ఆగస్టులో కురిసిన అధిక వర్షాలతో తీరని నష్టం

- భూమిలో తేమశాతం పెరగడమే కారణం
- రసం పీల్చే పురుగుల బెడదతో ఎదుగుదల లోపించిన చేలు
- దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో పత్తి రైతులు

పత్తిసాగు	91,000 ఎకరాలు
దిగుబడి అంచనా	9లక్షల క్వింటాళ్లు
సీసీఐ మద్దతు ధర	రూ.8,100

నాగారం : పత్తిపంట సాగు చేసిన రైతులను అధిక వర్షాలు నిండాముంచాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగి చేలు ఎర్రబారుతున్నాయి. దీనికితోడు పత్తిచేలను చీడపీడల బెడద పట్టిపీడిస్తోంది. ఫలితంగా దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

గతేడాది అధిక దిగుబడి రావడంతో..

గత ఏడాది పత్తిసాగు చేయడంతో రైతులు అధిక దిగుబడులు సాధించారు. దీంతో ఈ ఏడాదికూడా రైతులు ఎక్కువగా పత్తిసాగుకే మొగ్గుచూపారు. కానీ ప్రస్తుత సీజన్‌లో పత్తి సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా ఆగస్టు నెల నుంచి కురుస్తున్న వర్షాలతో పత్తి చేలల్లో నీళ్లు నిలిచి ఎదుగుదల లోపించింది. మొక్క ఎండిపోవడంతో పాటు, చేలు ఎర్రబారుతున్నాయి. ఫలితంగా చేలన్నీ పూత, కాయలు రాలిపోతున్నాయి. దీనికి తోడు చీడపీడల బెదల ఎక్కువైందని రైతులు అంటున్నారు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు మదనపడుతున్నారు.

91 వేల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 91వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేశారు. 8 లక్షల నుంచి 9 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌కు గాను ప్రభుత్వం క్వింటా పత్తి మద్దతు ధర రూ.8,110 ప్రకటించింది.

ఈ సారి దిగుబడి కష్టమే..

పత్తిసాగులో సహజంగా ఎర్రనేలల్లో అయితే ఎకరాకు 8 నుంచి 10క్వింటాళ్లు, నల్లరేగడి భూమిలో ఎకరాకు సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ వర్షాలు ఇలాగే కురిస్తే ఎకరాకు 5 క్వింటాల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదని అధికారులు అంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తిపంటలో నీళ్ల నిలిచి చేలు ఎర్రబారుతుండటంతో ఈ ఏడాది దిగుబడి రావడం కష్టమేనని రైతులు భావిస్తున్నారు.

చుట్టుముట్టిన చీడపీడలు

అధిక వర్షాల కారణంగా పత్తి చేలను చీడపీడలు చుట్టుముట్టాయి. ముఖ్యంగా పత్తిచేలల్లో రసం పీల్చే తెల్ల, పచ్చదోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ పురుగులు ఆకుల అడుగుభాగంలో చేరి రసం పీల్చడం వల్ల మొక్కలలో ఎదుగుదల లోపించి ఆకుముడత, ఆకులు గిడస బారుతున్నాయి. అలాగే అధిక తేమ వల్ల పత్తిలో పూత, పిందె రాలిపోతుంది. సీజన్ ఆరంభంలో పత్తి పైర్ల ఏపుగా పెరిగినా ఆగస్టు నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పురుగు మందులు పిచికారీ చేసిన ఫలితం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగుమారిన పత్తిని ప్రభుత్వమే కొనాలి



ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఎకరానికి సుమారు రూ.15 వరకు ఖర్చు అయ్యింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తిచేను మొత్తం ఎర్రబారింది. ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశమే ఉంది. రంగుమారిన పత్తిని ప్రభుత్వం కొనాలి. ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి.
– బండగొర్ల దుర్గయ్య, రైతు, పస్తాల, నాగారం మండలం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తిచేలల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వరుస వర్షాల కారణంగా పత్తిచేలల్లో నీరు ఎక్కువగా నిలిచి ఉంటే చిన్న, చిన్న కాలువలు ఏర్పాటు చేసి నీటిని తొలగించాలి. పత్తిలో రసంపీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమల నివారణకు వ్యవసాయశాఖ అధికారులు సలహాలతో సకాలంలో మందులు పిచికారీ చేసుకోవాలి.
– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

22 నెలలైనా గ్యారంటీల జాడేలేదు

• మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ఉండ్రుగొండ గ్రామస్తులకు కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : ఇరవై రెండు నెలల కాంగ్రెస్ పాలనలో గ్యారంటీల జాడేలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చివ్వెంల మండలం ఉండ్రుగొండ గ్రామంలో ఇంటింటికి కాంగ్రెస్ గ్యారంటీల బాకీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. గ్యారంటీలు ఇవ్వడమే కాదు.. అవి రాకపోతే మాకు గుర్తు చేయమని అనాడే కాంగ్రెస్ నాయకులు చెప్పారని, అందుకే ఎవరెవరికి ఎంత బాకీ ఉన్నారో గుర్తుచేయడాలనికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు రూ.17వేల కోట్లు రుణమాఫీ చేసి రూ.20వేల కోట్లని చెబుతున్నారని విమర్శించారు. రైతు భరోసా కింద ఒక్కో ఎకరాకు రూ.19వేలు, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని చెప్పి ఒకొక్కరికి రూ.55వేలు, ఆసరా పెన్షన్ల కింద ఒక్కొక్కరికి రూ.44వేలు, ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి రూ.22వేలు బాకీ ఉన్నారన్నారు. నిరుద్యోగులకు 50వేల ఉద్యోగాలు అని చెప్పి 5వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రూ.24వేలు బాకీ ఉన్నారన్నారు. ఇచ్చిన ఒక్క గ్రూప్–1 నోటిఫికేషన్లో కూడా మొత్తం పైరవీలు చేసి కోట్ల రూపాయలు తీసుకుని ఆంధ్రోళ్లకు ఇచ్చారని ఆరోపించారు. ఆడపిల్లలకు స్కూటీలు, విద్యార్థులకు భద్రత కార్డులు ఇవ్వలేదన్నారు. ఈ హామీలు కేవలం సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే ఇచ్చినవి కావని.. ఏఐసీసీ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇచ్చినవే అని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులనే కాదు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. వీటన్నింటిపై ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన చిన్న చిన్న లీడర్లు ఫోన్ చేసినా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. యూరియా కోసం లైన్‌లో నిలబడి మహిళలు చనిపోతే కనీసం కాంగ్రెస్ నాయకులు పరామర్శించలేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు ఇంటి ముందుకు వస్తే బాకీ కార్డు చూపించి నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి ఆకుల లవకుశ, మాజీ ఎంపీపీ ధరావతు బాబునాయక్, గుర్రం సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు, మాజీ సర్పంచ్ పల్లేటి శైలజనాగయ్య, నాగార్జున పాల్గొన్నారు.

ట్రాక్టర్ పంపిస్తాం.. డీజిల్ పోసుకోండి!




జానకీనగర్ గ్రామ వీధుల్లో ఉన్న చెత్త, నరికేసిన చెట్ల కొమ్మలు

- జానకీనగర్ వాసులతో జీపీ సిబ్బంది
- చెత్తమయంగా గ్రామ వీధులు
- వెంటనే వీధుల్లో చెత్త, చెట్ల కొమ్మలను తొలగించాలని గ్రామస్తుల వేడుకోలు

చిలుకూరు: మండలంలోని జానకీనగర్ గ్రామ వీధులు చెత్తమయంగా మారాయి. గ్రామ పంచాయతీ (జీపీ) సిబ్బంది తొలగించకపోవడంతో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. చెత్తను తొలగించమని గ్రామ పంచాయతీని కోరితే డీజిల్‌కు డబ్బులు లేక జీపీ ట్రాక్టర్ నడవడం లేదని, ట్రాక్టర్‌ను పంపుతాం.. డీజిల్ పోసుకోండి అని అంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. చెత్తతోపాటు చెట్ల కొమ్మలను తొలగించి వీధుల్లోనే వేశారు. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, వెంటనే చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శి రజితను వివరణ కోరగా నిధుల కొరత ఉందని, ట్రాక్టర్ డీజిల్‌కు కూడా నిధులు లేవని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

'ఉపాధి'లో బోగస్ హాజరుకు చెక్

ముఖగుర్తింపు హాజరు విధానానికి శ్రీకారం

- ఆన్‌లైన్‌లో కూలీల వివరాలు నిక్షిప్తం చేస్తున్న అధికారులు
- ఇప్పటికే నమోదైన లక్షమంది కూలీలు
- వచ్చే నెలలో పూర్తికానున్న ప్రక్రియ



చిలుకూరులో కూలీల ఫొటోలు, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

మండలాలు	23
గ్రామాలు	475
జాబ్‌కార్డులు	2,63,000
కూలీల సంఖ్య	5,60,275
పనులకు వెళ్తున్నవారు	3,34,539

చిలుకూరు: ఉపాధిహామీ పథకం కింద పనులు చేసే కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా నూతనంగా ఉపాధి కూలీల ముఖగుర్తింపు హాజరు (ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్) విధానానికి శ్రీకారం చుట్టింది. ఒకరి పేరిట మరొకరు పనులకు వెళ్లటం లాంటి వాటికి చెక్ పడనుంది. నూతన విధానాన్ని అమలు చేసేందుకు జిల్లాలో మూడు రోజులుగా ఉపాధిహామీ కూలీల ముఖ చిత్రం, ఇతర వివరాల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. అన్ని గ్రామాల్లో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్‌లు) ఆన్‌లైన్‌లో కూలీల ఫేస్ ఐడీ నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు లక్షకుపైగా కూలీల కార్డులకు సంబంధించి ముఖ చిత్రాల సేకరణ నమోదును పూర్తిచేశారు. సూర్యాపేట మండలంలో 2,600 మంది వివరాలు సేకరించి ముందుండగా చింతలపాలెం మండలంలో కేవలం 50 మంది వరకే సేకరించారు.

అక్రమాలు జరగకుండా..

ఉపాధి పనుల విషయంలో గతంలో చనిపోయిన వారి పేరిట జాబ్‌కార్డు ఉంటే వారిపేరు మీద కుటుంబ సభ్యులు పనులకు వెళ్లేవారు. అలాగే 100 రోజుల పనిదినాలు పూర్తిచేసిన వారు ఇతరుల కార్డులతో పనిచేయడం వల్ల అక్రమాలు చోటుచేసుకునేవి. అయితే ఇకనుంచి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త విధానంతెచ్చింది.

పారదర్శకత కోసమే..



ఉపాధిహామీ పథకం అమలులో మరింత పారదర్శకత కోసమే ప్రభుత్వం ముఖగుర్తింపు హాజరు విధానాన్ని తెచ్చింది. అన్ని గ్రామాల్లో కూలీల ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. క్షేత్ర సహాయకులు, కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు కూలీలవివరాలు నమోదు చేస్తున్నారు. దీన్ని వచ్చేనెల మొదటి వారంలో పూర్తిచేస్తాం. అప్పటిలోగా పనులకు వచ్చే ప్రతిఒక్క కూలీ ఫేస్ ఐడీ నమోదు చేసుకోవాలి.
– అప్పారావు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

కొత్త విధానం అమలైతే..

కొత్తగా తెచ్చిన ముఖగుర్తింపు హాజరు విధానం అమలైతే అక్రమాలకు చెక్ పడనుంది. ఈ విధానం వల్ల ఆన్‌లైన్‌లోనే హాజరు నమోదు కానుంది. ఎవరూ పనులకు వస్తే వారి పేరిట మాత్రమే హాజరు నమోదు కానుంది. ఒక జాబ్‌కార్డులో నలుగురు కూలీలు ఉంటే పనికి వచ్చిన వారి పేరిటే హాజరు నమోదుతో పాటు వేతనం కూడా వారి ఖాతాలోనే జమవుతుంది. చెల్లింపులు సైతం త్వరితగతిన పూర్తవుతాయి.



• మందిరం కాదు.. మండపం

కోదాడ: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని నయానగర్ నూతన మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత భారీ మండపం మందిరాన్ని తలిపిస్తోంది. ప్రత్యేకంగా అలంకరించిన ఈ మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

మూసీ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న వరద

కేతేపల్లి : మూసీ రిజర్వాయర్‌కు వరద కొనసాగుతోంది. మూసీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. శనివారం 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం 20,936 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ఆరు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 11,231 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 185 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



మూసీ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పోతున్న వరదనీరు

క్లుప్తంగా

సంతానం కలగడం లేదని వివాహిత ఆత్మహత్య



అశ్విని (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: సంతానం కలగడం లేదని మనోవేదనకు గురైన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం యాదగిరిగుట్ట సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరుకు చెందిన గుంటి కాపుల అశ్విని (30)కి యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి చెందిన క్లౌపల్లి రాఘవేంద ర్‌తో 2015లో వివాహం జరిగింది. వివాహం జరిగి పదేళ్లు అవుతున్నా వారికి సంతానం కలుగలేదు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. సంతానం కోసం డాక్టర్లను సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో మనోవేదనకు గురైన అశ్విని గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ క్రమంలో శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో వంగపల్లిలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి అశ్వినిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి గుంటి కాపుల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌కు ఉత్తమ అవార్డు



ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకుంటున్న కంది భజరంగ్ ప్రసాద్

రామగిరి: ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో నల్లగొండ సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కంది భజరంగ్ ప్రసాద్‌కు ఉత్తమ ఫొటో జర్నలిస్ట్‌గా అవార్డు లభించింది. ఆదివారం ఏపీలోని గుంటూరు జిల్లా మోదుకూరు వేమన సాహిత్య వికాస భవనంలో ఆంధ్ర లయోలా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింగారెడ్డి మెల్కియార్, అకాడమీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, విజువల్ కమ్యూనికేషన్ హెచ్‌ఓడీ గద్దం రాయప్ప, పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఏమని శివనాగిరెడ్డి చేతులమీదుగా భజరంగ్ ప్రసాద్ అవార్డు అందుకున్నారు.

కష్టపడ్డారు.. ఫలితం దక్కింది

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆదివారం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగాలు సాధించారు. కొందరు ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కొన్నేళ్లుగా గ్రూప్స్‌కు సన్నద్ధమవుతూ విజయం సాధించగా.. మరికొందరు ఇప్పటికే పలు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ గ్రూప్–2 ఉద్యోగాలు సాధించారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



మోర్తా రాంనర్సిరెడ్డి

మాడుగులపల్లి: మాడుగులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన మోర్తాల రాంనర్సిరెడ్డి గ్రూప్–2 ఫలితాల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. రాంనర్సిరెడ్డి చిన్నతనంలోనే అతడి తండ్రి శేఖర్‌రెడ్డి మృతిచెందగా.. పట్టుదలతో చదివి గ్రూప్–2, 3 ఉద్యోగాలు సాధించారు. అంతే కాకుండా హైకోర్టు అసిస్టెంట్ ఫలితాల్లో కూడా మెరిట్ పొంది ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు పొందిన రాంనర్సిరెడ్డిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

వ్యవసాయ కుటుంబం నుంచి గ్రూప్–2 ఉద్యోగం సాధించి..



బొజ్జ శ్యామ్

నిడమనూరు: గ్రూప్–2 ఫలితాల్లో నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన బొజ్జ శ్యామ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్(కోఆపరేటివ్ సొసైటీస్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూలో పీజీ పూర్తిచేసిన శ్యామ్ 2021 నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. అశోక్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం కుటుంబం నుంచి వచ్చి అశోక్ గ్రూప్–2 ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎస్‌ఓగా పంచాయతీ కార్యదర్శి..



అంగోతు నరేశ్

చివ్వెంల : మండల పరిధిలోని రాజుతండా గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అంగోతు నరేశ్ ఆదివారం ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 717 ర్యాంకు సాధించి ఏఎస్‌ఓగా ఎంపికయ్యాడు. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామ ఆవాసం అంగోతు తండాకు చెందిన నరేశ్ 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్–2లో ఉత్తీర్ణత సాధించి ఏఎస్‌ఓగా ఎంపిక కావడం పట్ల తండావాసులు, సహ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఎస్టీ విభాగంలో రాష్ట్రస్థాయి 16వ ర్యాంకు సాధించినట్లు నరేశ్ తెలిపాడు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా హరిప్రీత్‌రెడ్డి



హరిప్రీత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో శాలిగౌరారం మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన కె.హరిప్రీత్ రెడ్డి కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగం సాధించాడు. గతంలో ఆయన గ్రూప్–4 ఉద్యోగం సాధించి చిట్యాల మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్–2 రాసిన మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం పట్ల ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎంపీఓగా..



మైనం అశోక్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం మైనవారిగూడెం గ్రామానికి చెందిన మైనం సుధాకర్, నాగమణి దంపతుల కుమారుడు మైనం అశోక్ ఆదివారం వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో మండల పంచాయతీ ఆఫీసర్(ఎంపీఓ)గా ఎంపికయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన అశోక్ గతంలో గ్రూప్–4కు ఎంపికై ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అదేవిధంగా గ్రూప్–3లో కూడా ఉద్యోగం సాధించారు. ఇంకా ఉన్నతమైన ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్నానని, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని అశోక్ తెలిపారు. ఆయను తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

కార్యదర్శి నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా..



కంచర్ల రాజశేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : గ్రూప్–2 ఫలితాలలో భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి పంచాయతీ కార్యదర్శి కంచర్ల రాజశేఖర్ రెడ్డి సచివాలయం సాధారణ పరిపాలన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి మండలంలోని జలాల్‌పురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరాడు. రాజశేఖర్‌రెడ్డిది స్వస్థలం చౌటుప్పల్ మండలం మల్కాపూర్ గ్రామం. తండ్రి లారీ డ్రైవర్ కాగా, తల్లి గృహిణి. స్థానికంగా జెడ్పీ హైస్కూల్ ఎస్సెస్సీ, చౌటుప్పల్‌లో ఇంటర్, నేతాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. గ్రూప్ –2 ఫలితాలలో అసిస్టెంట్ సెక్షన్‌ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడం పట్ల ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ మాజిద్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, తల్లిదండ్రులు, తోటి పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

చికిత్స పొందుతూ మృతి



మమత (ఫైల్)

మోత్కూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన చేకూరి మల్లేషం భార్య విజయనిర్మల అలియాస్ మమత (48) ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి కారులో ఆరెగూడెం వస్తుండగా.. భువనగిరి మండలం కుమ్మరిగూడెం సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన మమతను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

18 గేట్ల ద్వారా 'పులిచింతల' నీటి విడుదల



గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు : ఎగువన ఉన్న నాగార్జున సాగర్ తోపాటు మూసీ ప్రాజెక్టులు, టెయిల్‌పాండ్ గేట్లు ఎత్తడంతో చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చిచేరుతుంది. ఆదివారం రాత్రి వరకు 6,00,685 క్యూసెక్కుల వరద రాగా ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. దీంతో 18 గేట్లను 4 నుంచి 5 మీటర్ల మేర పైకెత్తి అవుట్‌ఫ్లోగా 6,08,541 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ 4 యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

విశిష్ట వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి





కూరెళ్ల విఠలాచార్య, ఎన్. అశోక్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తదితరులు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు

రామన్నపేట: సమాజంలోని విశిష్ట వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ చేపట్టిన సేవా పక్షోత్సవంలో భాగంగా ఆదివారం పార్టీ రాష్ట్ర కమిటీ తరపున రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను, రాజకీయ రంగంలో దివ్యాంగుల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించిన డాక్టర్ ఎన్. అశోక్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం, బుద్ధ గ్రంథాలయంను కాసం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు సందర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని అనేక మంది విశిష్ట వ్యక్తులు, ప్రాంతాలు, ప్రత్యేకతలను గుర్తించి ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. ఆయన వెంట నాయకులు నకిరేకంటి మొగులయ్య, మడూరి ప్రభాకర్‌రావు, మైల నర్సింహ, శాగ చంద్రశేఖర్ రెడ్డి, మండల వెంకన్న, తాటిపాముల శివకృష్ణ, వనం అంజయ్య, బండ మధుకర్‌రెడ్డి, నకిరేకంటి మహేష్, చెరుపల్లి శ్రవన్, మొగిలి రమేష్, గూడెల్లి దామోదర్, గంజి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బుద్ధుడి పుస్తకాన్ని అందిస్తున్న బుద్ధవనం సిబ్బంది

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం స్వేరోస్ ఫౌండర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. రెండు రోజులుగా స్థానిక విజయ్ విహార్ సమావేశ మందిరంలో స్వేరోస్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు హాజరైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం బుద్ధవనానికి వెళ్లారు. ధ్యానమందిరంలో ధ్యానం చేశారు. ఆయనకు మహాస్థూపంపై గల విగ్రహాల వివరాలను బుద్ధవనం గైడ్ వివరించారు. బుద్ధుడి పుస్తకాలను అందజేశారు.

సినిమా సెట్టింగ్‌లా దుర్గాదేవి మండపం



పెద్దగూడెంలోని దుర్గాదేవి మండపం (ఇన్‌సెట్‌లో) లక్కీ డ్రాలో విజేతలకు ఇవ్వనున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం సినిమా సెట్టింగ్‌ను తలపిస్తోంది. మండపం బయట శివపార్వతులు, నందీశ్వరుడి విగ్రహాలతో పాటు మండపం సెట్టింగ్ పైన పలు దేవతా విగ్రహాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. అదేవిధంగా ఈ మండపం వద్ద ఉత్సవ నిర్వాహకులు భక్తులకు లక్కీ డ్రా ఆఫర్లు పెట్టారు. రూ.201 చెల్లించి కూపన్ కొనుగోలు చేసిన భక్తులకు అక్టోబర్ 3న నిర్వహించే బంపర్ డ్రాలో మొదటి బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, రెండో బహుమతిగా కలర్ టీవీ, మూడో బహుమతిగా కుక్కర్ ఓవన్, నాల్గవ బహుమతిగా 3 గ్రాముల సిల్వర్ కాయిన్ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ సాధారణం



ఆలయ మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ మాడ వీధుల్లో, ప్రసాద విక్రయశాలలో, క్యూలైన్లల్లో భక్తుల సందడి సాధారణంగా కనిపించింది. స్వామివారిని 30వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి నిత్యాదాయం రూ.20,63875 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

జాతీయ రహదారిపై కొనసాగుతున్న రద్దీ



చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఆదివారం సైతం కొనసాగింది. దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ప్రజలు సొంతూళ్లకు ప్రయాణాలు సాగిస్తుండడంతో హైవేపై ఇరు మార్గాలలో వాహనాలు బారులుదీరి నెమ్మదిగా ముందుకు సాగాయి. పండుగ రద్దీకి తోడు చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం వారాంతపు సంత ఉండడంతో జనం కిటకిటలాడారు.

భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- వృద్ధ దంపతులకు గాయాలు





గాయపడిన రామయ్య, లక్ష్మి

పెద్దవూర: భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో వృద్ధ దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని రామన్నగూడెంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన నక్క రాములు, అతడి సోదరికి మధ్య కొంతకాలంగా భూ వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రామయ్య సోదరి కుమారులైన రామలింగయ్య, శంకరయ్య రామయ్యతో పాటు అతడి భార్య లక్ష్మిపై దాడి చేశారు. దీంతో వారిద్దరి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధ దంపతులను చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దవూర పోలీసులు పేర్కొన్నారు.

రెండు లారీల మధ్య ఇరుక్కుపోయిన కారు

భువనగిరి : రెండు లారీల మధ్య కారు ఇరుక్కుపోయిన ఘటన భువనగిరి పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు వస్తున్న కారు భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. రెండు లారీల మధ్య కారు ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారు పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వేల్స్‌లో లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వేల్స్ రాజధాని కార్డిఫ్ నగరంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. యునైటెడ్ కింగ్డమ్ కార్డిఫ్ హిందూ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, అర్చకులు కిరణ్‌కుమార్‌చార్యులు, దోర్బాల భాస్కర్‌శర్మ బృందం పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవంలో డాక్టర్ వెలగపూడి బాపూజీరావు, అన్నపూర్ణ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలమర్రి ఆలయాల సందర్శన



పిల్లలమర్రి నామేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకుడు అర్జునరావు

సూర్యాపేట: సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని రాష్ట్ర రక్షిత కట్టడాలైన నామేశ్వర ఆలయం, ఎరకేశ్వర దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర పురా వస్తు శాఖ సంచాలకుడు అర్జునరావు కుతాడి సందర్శించారు. ఆలయాల స్థితిగతులను పరిశీలించడంతో పాటు వాటి అభివృద్ధి కోసం ఏం చేయాలని పురావస్తు శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు, పర్యాటకులకు ఆలయాల చరిత్ర తెలియజేసే విధంగా సైన్ బోర్డులు, వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆలయ గోడలపై ఉన్న వైట్‌వాష్‌ను వెంటనే రసాయనాలతో శుద్ధి చేసి శిల్ప సంపదను, చరిత్రను భక్తులు, పర్యాటకులు స్పష్టంగా చూడగలిగేలా చేయాలన్నారు. ఆలయంలో ఉన్న శాసనాల వివరాలను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించి చరిత్రకారులకు, పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పర్యాటకులకు ఆలయ చరిత్ర వివరించడానికి ఒక టూరిస్ట్ గైడ్‌ను కూడా నియమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ పి. నాగరాజు, ఎన్. నర్సింగ్‌నాయక్, మహాత్మాగాంధీ యూనివర్సిటీకి చెందిన చరిత్రకారులు డాక్టర్ షరీఫ్, రామకృష్ణ, డాక్టర్ కిషోర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.